ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- వ్యవసాయ కనెక్షన్లకు 368 మంది దరఖాస్తు
- ఇందులో 239 మంది రైతులు డీడీ చెల్లించారు
- ఏడాదిన్నర దాటినా అందని ట్రాన్స్‌ఫార్మర్లు
- పంటలు ఎండుతున్నాయని రైతుల గగ్గోలు


ఈదుల ముష్టూరు వద్ద నీరందక ఎండుతున్న చీనీ మొక్కలు

బత్తలపల్లి: దేశానికి వెన్నెముక అయిన అన్నదాతలకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. బోరుబావుల కింద చీనీ, అరటి, కూరగాయలు, వేరుశనగ తదితర పంటలు పండించుకుందామని విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వేసిన అంచనా మేరకు రుసుమును డీడీ రూపంలో చెల్లించారు. అయినా ట్రాన్స్‌ఫార్మర్లు అందలేదు. కనెక్షన్ ఇవ్వలేదు. ఏడాదిన్నర దాటినా అతీగతీ లేదు. ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి.. తామెలా జీవనం సాగించాలని ప్రశ్నిస్తున్నారు. బత్తలపల్లి మండలంలో 40 గ్రామాలు ఉన్నాయి. బోరుబావులు కల్గిన రైతులు 368 మంది విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 239 మంది విద్యుత్ అధికారులు వేసిన ఎస్టిమేషన్ మేరకు డబ్బు సైతం చెల్లించారు. విద్యుత్ కనెక్షన్ వస్తే మోటర్ ద్వారా బోరునీటితో పంటలు పండించుకుందామని ఆశించిన వారికి నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు అంద ఇబ్బందులు పడుతున్నారు. సాగు చేసిన పంటలు నీరందక కళ్లెదుటే ఎండిపోతున్నాయి. ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో రైతులు ఉండిపోతున్నారు.

ఫోరంలో కేసు వేస్తాం

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రభుత్వానికి డీడీలు చెల్లించి ఏడాదికి పైగా అవుతున్నా ఇంతవరకు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నందున న్యాయం కోసం వినియోగదారుల ఫోరంలో కేసు వేయాలనుకున్నట్లు ఈదులముష్టూరు రైతులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ నెల రోజులు గడువు కోరినందున అంతవరకు ఎదురు చూస్తామన్నారు. అప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్లు అందకపోతే కేసు వేస్తామని స్పష్టం చేశారు.


ట్రాన్స్‌ఫార్మర్లు కోసం డీడీలు చెల్లించినట్లు చూపుతున్న రైతులు


ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

పక్క పొలం రైతుపై ఆధారపడ్డా



నాకున్న ఐదు ఎకరాల పొలంలో వేరుశనగ, చీనీ సాగు చేసుకుంటున్నా. ట్రాన్స్‌ఫార్మర్ కోసం 2023 డిసెంబర్‌లో డబ్బులు చెల్లించాం. ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. బోరులో నీరు సమృద్ధిగా ఉంది. పంటను ఎలాగైనా కాపాడుకోవాలని నీటి కోసం పక్క పొలంలోని రైతుపై ఆధారపడుతున్నాం. ఇలా ఎన్ని రోజులని ఎదురుచూడాలో అర్థం కావడం లేదు.

–తలారి లింగప్ప, రైతు, ఈదుల ముష్టూరు, బత్తలపల్లి మండలం.

రూ.38వేలు చెల్లించా



విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ కోసం 2023 డిసెంబర్‌లో రూ.38వేలు చెల్లించాను. అప్పటి నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎప్పుడు అడిగినా ఇంకా మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే లెటర్ తీసుకురావాలని చెప్తే.. తీసుకొచ్చి ఇచ్చాను. అయినా ఇంత వరకు ఎలాంటి స్పందనా లేదు. పంటలు పండించుకోకుండా ఇలాగే ఉండిపోవాల్సిందేనా?

– మాల శివయ్య, రైతు, ఈదుల ముష్టూరు

నీరున్నా పంటలు పెట్టలేకపోతున్నాం



బోరులో నీరు సమృద్ధిగా ఉన్నా పంట సాగు చేసుకోలేకపోతున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయాం. ఏడాది క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులందరూ డీడీలు తీసి అధికారులకు అందజేశాం. ఇంతవరకు తమకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వలేదు. ఏమని అధికారులను అడిగితే వైరు సరఫరా కాలేదని సమాధానం చెబుతున్నారు. ఇలా మాతో ఆటలు ఆడుకుంటున్నారు.

–తలారి కాటమయ్య, రైతు, ఈదుల ముష్టూరు, బత్తలపల్లి మండలం.

మా పరిధిలో లేదు

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం 239 మంది రైతులు డబ్బులు చెల్లించిన మాట వాస్తవమే. ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరయ్యాయి. అయితే కరెంటు పోల్లకు కండక్టర్, తీగలు సరఫరా కాలేదు. అది మా పరిధిలో లేదు. రైతుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. ప్రభుత్వం నుంచి కండక్టర్, కేబుల్ సరఫరా అయితే అప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తాం.

– శివయ్య, ట్రాన్స్‌కో ఏఈ, బత్తలపల్లి

భద్రతా నియమాలు పాటించాలి

- అమల్లోకి నూతన జరిమానాలు


సీఐ నరేంద్రరెడ్డి

నల్లమాడ: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్ష ప్రయాణం సాగించాలని సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నూతన ట్రాఫిక్ జరిమానాలు అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామన్నారు. వాహనానికి బీమా లేకుండా మొదటిసారి పట్టుబడితే రూ.2 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.4 వేలు, లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే రూ.5 వేలు జరిమానా ఉంటుందన్నారు. ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు నడిపే డ్రైవర్లు యూనిఫాం ధరించకపోతే మొదటి సారి రూ.150, రెండోసారి రూ.300 విధిస్తామన్నారు. డ్రైవర్‌తో పాటు కో డ్రైవర్ కూడా సీట్ బెల్టు విధిగా పెట్టుకోవాలని, లేనిపక్షంలో ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామన్నారు. వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, రెన్యూవల్ చేయకపోయినా రూ.5 వేలు, అధిక వేగం, త్రిబుల్ రైడింగ్‌కు రూ.వెయ్యి చొప్పున, రేసింగ్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.1,500, సెల్‌ఫోన్‌తో పాటు ఇతర వస్తువులు ఏవైనా చేతిలో ధరించి డ్రైవింగ్ చేస్తే రూ.1,500 నుంచి రూ.10 వేలు వరకు జరిమానా విధిస్తామన్నారు. ఇవేగాక ఐపీసీ, మోటార్ వెహికల్ చట్టాలను అనుసరించి కేసులు కూడా నమోదు చేయనున్నట్లు చెప్పారు. వాహనదారులు వీటిని గుర్తెరిగి రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రాణనష్టం జరగకుండా నడపాలని సూచించారు.

దేవర ఎద్దుల వేల్పునకు విరాళాలు



విరాళాలు అందజేస్తున్న సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, డాక్టర్ బత్తలప హరిప్రసాద్

కదిరి అర్బన్: బూరుగుపల్లి దేవర ఎద్దుల వేల్పునకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ మంగళవారం రూ. 10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు మణికంఠనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ తనవంతుగా రూ.15 వేల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, అంజి, నరసింహులు, ఎద్దుల హరి, సూరినేనికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో నాటుసారాకు చెక్


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్

కదిరి అర్బన్: ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖలు సమన్వయంతో పని చేస్తే సమూలంగా నాటుసారా తయారీని అరికట్టవచ్చని ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో 'నవోదయం 2.0' కార్యక్రమంపై డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు ఎంపీడీఓలు, ఎస్‌హెచ్‌జీలు, ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద్‌నాయక్‌తో కలిసి ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. నాటుసారా నిర్మూలన అందరి సమన్వయంతోనే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖలు నాటుసారా స్థావరాలను అరికట్టాలన్నారు. నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందునాయక్ వివరించారు. నాటుసారాతో ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోతాయన్నారు. నాటుసారా తయారు చేస్తూ పట్టుబడితే పడే శిక్షల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కదిరి ఎక్సైజ్ సీఐ వీరారెడ్డితో పాటు పలువురు పోలీసులు పాల్గొన్నారు.

నాటుసారాతో అన్ని అనర్థాలే

చెన్నేకొత్తపల్లి: నాటుసారాతో అన్ని సమస్యలే అని, దానికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ఫరూక్ అజాం, ఎస్‌ఐ శివప్రసాద్ ప్రజలకు సూచించారు. మేడాపురం గ్రామంలో మంగళవారం నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సర్పంచ్ రామాంజినేయులు, ఆర్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ మానవ ధర్మం


ధర్మ పరిరక్షణపై నగర సంకీర్తన (ఇన్‌సెట్) శివలింగం ఊరేగింపు

పుట్టపర్తి రూరల్: ధర్మ పరిరక్షణ మానవ ధర్మమని బ్రహ్మకుమారీస్ సిస్టర్ కల్పన పేర్కొన్నారు. మంగళవారం ఎనుములపల్లిలో బ్రహ్మకుమారీస్, ఆధ్యాత్మికత, ఆరోగ్య శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిస్టర్ కల్పన మాట్లాడుతూ ధర్మాన్ని పరిరక్షిస్తే అదే మనల్ని కాపాడుతుందన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని త్రిమూర్తి శివ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే శివలింగాన్ని ఊరేగించినట్లు తెలిపారు. గ్రామంలో రామాలయం నుంచి తాత్కాలిక ఆశ్రమం వరకు నినాదాలు చేస్తూ నగర సంకీర్తన చేపట్టారు. కార్యక్రమంలో బ్రాహ్మకుమారీస్ నిర్వాహకులు సాయిసూపర్ బజార్ జయరాం, గోపి, డాక్టర్ క్రిష్టయ్య పాల్గొన్నారు

వివాహిత ఆత్మహత్యపై ఫిర్యాదు

తనకల్లు: పెద్దపల్లిలో రెండు రోజుల క్రితం శాంతమ్మ (30) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆలస్యంగా ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాంతమ్మ ఆదివారం రాత్రి ఎవరితోనే ఫోన్‌లో మాట్లాడడం భర్త వెంకటేష్ గమనించి మందలించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. అనంతరం మనస్తాపం చెందిన శాంతమ్మ గదిలోకి వెళ్లి ఉరి వేసుకుంది. మృతురాలి అన్న మురళీకృష్ణ మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగసుబ్బయ్య తెలిపారు.

అదిగో.. ఇదిగో..

- ఉపాధి కూలీలకు అందని కూలి
- రెండు నెలలుగా ఎదురుచూపులే
- కుటుంబ పోషణకు ఇబ్బందులు


సీఆర్ పల్లి వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తనకల్లు: వలస పోకుండా ఉన్న ఊరిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వేతన చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. చేతిలో డబ్బు లేకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 175 గ్రామాలు ఉన్నాయి. 50 వేలకు పైగా జనాభా ఉంది. 4,765 కుటుంబాలు జాబ్ కార్డులు కలిగి ఉన్నాయి. మొత్తం 8,437 మంది కూలీలున్నారు. ఉపాధి హామీ పథకం కింద జనవరి, ఫిబ్రవరి నెలల్లో ట్రెంచ్‌లు, కందకాలు తదితర పనులు జరిగాయి. కూలీలకు వేతన రూపంలో మొత్తం రూ.28.20 లక్షలు రావాల్సి ఉంది. అలాగే మెటీరియల్ పేమెంట్ కింద రూ.1.36 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు చేసిన కూలీలకు ప్రతి వారం వారి ఖాతాల్లో వేతనాలు (కూలి డబ్బులు) జమయ్యేవి. అయితే రెండు నెలలుగా చెల్లింపులు ఆగిపోయాయి. అధికారులను అడిగితే 'అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం' అంటూ చెబుతున్నారే తప్ప జమయ్యిందేమీ లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి?



నాకు ఆరు వారాల వేతనాలు రావాల్సి ఉంది. చేసిన పనులకు నెలల తరబడి డబ్బులు ఇవ్వకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి? ఇతర పనులకు వెళ్తే ఎప్పటికప్పుడు కూలి అందేది. ఊర్లోనే ఉంటూ పనికి పోవచ్చనే ఉద్దేశంతో ఉపాధి పనులకు వెళ్తే ఇప్పుడు కూలి డబ్బులు రాలేదు. నిత్యావసర సరుకులు కొనడానికి అగచాట్లు పడుతున్నాం.

– ఖాజావలి, కోటూరు

వారం వారం బిల్లులు చెల్లించాలి



చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోతే పనులకు ఎలా వెళ్ళాలి. ఊర్లోనే పని చేసుకోవచ్చనుకుంటే డబ్బులు రాక నానా అగచాట్లు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని కూలీలందరికి వేతనాలు అందేలా చొరవ చూపాలి. మాకు వారం వారం బిల్లులు చెల్లిస్తే బాగుంటుంది.

– బాబ్జాన్, కోటూరు

త్వరలో బిల్లులు చెల్లిస్తాం

ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పెండింగ్ వేతనాలన్నీ కూలీల ఖాతాల్లో జమవుతాయి.

– మరియమ్మ, ఏపీఓ, ఉపాధి హామీ, తనకల్లు

క్లుప్తంగా

ఇఫ్తార్ విందు


విందులో పాల్గొన్న మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: పట్టణంలోని పుర్హానియా మసీదులో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరయ్యారు. పలువురు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: అనారోగ్యంతో మృతి చెందిన కొత్తచెరువు మండలం యర్రపల్లికి చెందిన హోంగార్డ్ చెన్నప్ప కుటుంబానికి పోలీస్ హోం గార్డు వెల్ఫేర్ ఫండ్ కింద మంజూరైన రూ.15వేల చెక్కును ఎస్పీ రత్న మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ వలి, హోంగార్డు ఇన్‌చార్జ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

చావడి నిర్మాణానికి విరాళం


నగదు అందజేస్తున్న సమరసింహారెడ్డి

తనకల్లు: గోళ్లవారిపల్లి హరిజనవాడలో నూతనంగా నిర్మించిన ధనకొండ గంగమ్మ తల్లి చావడి నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎంజీ రెడ్డి రూ.75 వేల విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు సమరసింహారెడ్డి చేతుల మీదుగా మంగళవారం గ్రామస్తులకు అందజేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.సరస్వతి, నాయకులు రామకృష్ణ, రమణప్ప, పెద్దప్పల్ల (నరసింహులు) లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ఇంగ్లిష్–1 పరీక్షను నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ పేర్కొన్నారు. మొత్తం 186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పుట్టపర్తి టౌన్: మండల పరిధిలోని ఎనుములపల్లి, నిడిమామిడి ప్రాంతాల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎనుముపల్లి క్రాస్ వద్ద 11 మద్యం బాటిళ్లు, నిడిమామిడి క్రాస్ వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, వీటిని తరలిస్తున్న వారిని కోర్టులో హాజరుపరిచారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

ధర్మవరం రూరల్: గొట్లూరు పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలను ఈ నెల 20వ తేదీలోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ నారాయణస్వామి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడువులోపు రెన్యూవల్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి రాయితీలు అందవని స్పష్టం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


నల్లచెరువులో సర్పంచ్ పంచరత్నమ్మను సన్మానిస్తున్న అధికారులు

నల్లచెరువు/ ఓడీచెరువు: మహిళలు విద్యతో పాటూ అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ జయంతి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ సూపర్వైజర్ రఫీ మున్నీషా ఆధ్వర్యంలో నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ విద్యతోనే మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడతారన్నారు. ఉత్తమ సర్పంచ్‌గా జాతీయస్థాయి అవార్డు పొందిన సర్పంచ్ పంచరత్నమ్మను అధికారులు ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శకుంతల, సూపర్‌వైజర్లు పద్మావతి, జయమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఓడీచెరువు సమీపంలోని షాదీ మహల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సీడీపీఓ వరలక్ష్మి, డీసీపీఓ మహేష్, ఐసీపీఎస్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యవతి, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాధిక

ఎన్పీకుంట: ఎదుగుదల లేని పిల్లలకు పౌష్టికాహారం అందించడం వలన సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని సీడీపీఓ రాధిక పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహారం వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు, పోషక పదార్థాల మేళా నిర్వహించారు. రోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు తప్పక ఉండాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమయ్యే పోషక పదార్థాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

ఎన్పీకుంట: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ సూచించారు. ఎన్పీకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని గుర్తించి సకాలంలో వ్యాక్సిన్‌లు వేయాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు పాటించేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగలక్ష్మి, పీహెచ్ఎన్ శాంతమ్మ, సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు రమేష్‌రెడ్డి, ఆది, ఫార్మసిస్ట్ ప్రకాష్, ఏఎన్ఎమ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్న వ్యాఖ్యలను ఖండించిన యూటీఎఫ్


మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు యూటీఎఫ్‌కు వైఎస్సార్‌సీపీ ముసుగు వేస్తూ చేసిన వ్యాఖ్యలను యూటీఎఫ్ నాయకులు మంగళవారం ధర్మవరంలో ఖండించారు. స్థానిక ఎన్జీవో భవనం వద్ద యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణ మాట్లాడారు. యూటీఎఫ్‌కు వైసీపీ ముసుగు వేయడం సరికాదని, వాస్తవానికి ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని విమర్శించారు. కూటమి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓటమి, వారు విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టని అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని, దానికి యూటీఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో యూటీఎఫ్ ఓడిపోయినంత మాత్రాన ఆత్మస్థయిర్యం తగ్గదని, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. యూటీఎఫ్ ధర్మవరం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, సాయి గణేష్, మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లే రామాంజనేయులు, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజనేయులు, హరిశంకర్, ప్రదీప్‌కుమార్, వెంకట కిషోర్ పాల్గొన్నారు.

సాయి మందిరం సమయంలో మార్పులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వేళల్లో మార్పులు చేశారు. రోజూ సాయంత్రం వేదం 5 నుంచి 5.45 గంటల వరకు. 5.45 నుంచి 6.30 గంటల వరకు భజనలు ఉంటాయి. ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయి.